# తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక TELANGANAVENNELA WAKKU
**విలేకరులు కావలెను**
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :51 | 05-09- 2026 | శనివారం | పేజీలు: 4 | వెల:03/-


# అసెంబ్లీ సమావేశాలకు ముందే
# కేసీఆర్‌పై కాంగ్రెస్ వ్యూహం!

## ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నాకు సిద్ధం.. రంగంలోకి ఇద్దరు కీలక మంత్రులు



హైదరాబాద్

తెలంగాణ శాసనసభ సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయాలని భారత రాష్ట్ర సమితి వ్యూహాలు సిద్ధం చేస్తుండగా.. ప్రతిపక్షానికి ధీటుగా సమాధానం ఇచ్చేందుకు కాంగ్రెస్ కూడా ముందస్తు కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

శాసనసభ సమావేశాలు ప్రారంభం కాకముందే భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టేలా కాంగ్రెస్ భారీ ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రణాళిక రూపొందించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

గత పాలనపై ప్రశ్నాస్త్రాలు

2

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం..
# పార్టీ క్రమశిక్షణే ముఖ్యం

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్‌లో మాజీ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించిన వ్యవహారంపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించడం వ్యక్తిగతంగా బాధాకరమైన విషయమే అయినప్పటికీ, పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఆయన స్పష్టం చేశారు.

ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేష్ కుమార్ గౌడ్ ఈ పరిణామాలపై స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరికీ ఒక విధానం, ఒక క్రమశిక్షణ ఉంటుందని తెలిపారు. పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా బహిరంగంగా మాట్లాడే వారు ఎంతటి సీనియర్ నాయకులైనా చర్యలు తప్పవనే సంకేతాన్ని అధిష్ఠానం ఇచ్చిందని పేర్కొన్నారు.

అంతర్గత సమస్యలు బయటకు తేవద్దు

నాయకులకు పార్టీలో ఏవైనా అభిప్రాయ భేదాలు, అసంతృప్తులు లేదా ఇతర

2

# ఓటర్లకు మరో మూడు వారాలు!

## ప్రత్యేక సవరణ గడువు పొడిగింపుపై ఈసీ కసరత్తు.. ఉత్తర్వులే తరువాయి




హైదరాబాద్, సెప్టెంబర్ 4: తెలంగాణ వెన్నెల వాక్కు

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఓటర్ల నుంచి అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ గడువును మరో మూడు వారాల పాటు పొడిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

ఇంటింటి సర్వేలో పలువురు ఓటర్ల వివరాలు నమోదు

2

# విద్యకు పెద్దపీట.. అభివృద్ధికి వేగం!

## మద్దూరు నుంచి హకీంపేట్ వరకు సీఎం రేవంత్ పర్యటన



వికారాబాద్/నారాయణపేట, సెప్టెంబర్ 4: తెలంగాణ వెన్నెల వాక్కు

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో పర్యటించిన సీఎం వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న విద్యాసంస్థల భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నారాయణపేట జిల్లా మద్దూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి.. భవన నమూనాలు, నిర్మాణ ప్రణాళికలను పరిశీలించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడంతో పాటు

2

# నింగిలోకి 'నాటీ బాయ్'..
# విజయ విహారం!

## జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్.. ఈఓఎస్-05ను కక్ష్యలోకి చేర్చిన ఇస్రో



శ్రీహరికోట, సెప్టెంబర్ 4: తెలంగాణ వెన్నెల వాక్కు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ఘన విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ విజయవంతంగా దూసుకెళ్లింది. సుమారు 18

4

# రేవంత్--అసద్ దోస్తీపై కొత్త చర్చ!

## ఒకరిపై ఒకరు ప్రశంసలు.. తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం




హైదరాబాద్, సెప్టెంబర్ 4: తెలంగాణ వెన్నెల వాక్కు

తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఇరువురు నేతలు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి.. ఓవైసీ సోదరుల దేశభక్తిని ప్రశంసించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మరోవైపు అసదుద్దీన్ ఓవైసీ కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై సానుకూల వ్యాఖ్యలు చేశారు. పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసిస్తూ, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి చెందుతున్నాయని

3

# స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొడతారా?

## రాంకీకి చెత్త సేకరణ బాధ్యతలు ఇస్తే ఊరుకోం: కవిత




హైదరాబాద్, సెప్టెంబర్ 4: తెలంగాణ వెన్నెల వాక్కు

హైదరాబాద్‌లో స్వచ్ఛ ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ ఆటో కార్మికులతో సమావేశమైన ఆమె.. చెత్త సేకరణ బాధ్యతలను రాంకీ సంస్థకు అప్పగించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించారు. స్వయం ఉపాధి పొందుతున్న కార్మికులను రాంకీ సంస్థకు జీతగాళ్లుగా మార్చడం సరికాదన్నారు.

హైదరాబాద్‌లో వేలాది స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న కార్మికుల ఉపాధిపై ప్రభుత్వం నిర్ణయం ప్రభావం చూపుతుందని కవిత అన్నారు. ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు

3

తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



# నేడు నిర్మల్‌లో ఘనంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం

- కలెక్టరేట్ వేదికగా 70 మందికి పైగా ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం
- ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయుల వివరాలు వెల్లడించిన విద్యాశాఖ

నిర్మల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం 3:00 గంటలకు నిర్మల్ కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించనున్నారు పాఠశాల విద్య, సంక్షేమ గురుకులాలు, ఇంటర్, ఉన్నత విద్యా విభాగాల్లో విశేష సేవలందించిన పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది

**హెచ్ఎం, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల జాబితా:**
బి. రాజు (లక్ష్మణచాంద), రాజు అత్రజ్ (కుంటాల), సిద్ధిరామ్ మానాజీగారి (అందకూర్-కుంటాల), ఎ. సుమలత (జీపీఎస్ సాయినగర్-నిర్మల్), జె. లింగన్న (పెంబి)

**స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ):**
దుర్గం భూమయ్య (మున్నియల్-దస్తురాబాద్), బక్కి సుగుణ (సాంగ్వీ-దిలావర్‌పూర్), నల్లం వామన్‌రావు (దిలావర్‌పూర్), దేవునె శివకుమార్ (కడెం), టి.జి. వాణిశ్రీ (ఖానాపూర్), జి. ప్రసేన్‌జిత్ (బీర్‌నంది-ఖానాపూర్), సిహెచ్. రాజశేఖర్ (పల్సి-కుబీర్), కె. మహేందర్ (చాట-కుబీర్), నల్ల ధనంజయరెడ్డి (లక్ష్మణచాంద), ఎస్. వివేకానంద్ (లొహెస్రా-లోకేశ్వరం), బి. సాయారెడ్డి (అష్ట-ముధోల్), ఆర్. విజయలక్ష్మి (బాలికల జెడ్పీహెచ్ఎస్-ముధోల్), జె. ప్రేమసాగర్ (నర్సాపూర్-జి), గౌసుద్దీన్ (సోమవార్‌పేట్-నిర్మల్), పట్టేపు దేవదాసు (ముజ్గి-నిర్మల్ రూరల్), జి. చంద్రశేఖర్ వర్మ (పెంబి), కె. సాయన్న (స్వర్ణ-సారంగాపూర్), సంజు రాథోడ్ (బీర్వెల్లి-సారంగాపూర్), కె. ద్రుపత్ రెడ్డి (భోసి-తానూర్)

**ఎస్జీటీలు, సీఆర్టీలు ఉ కళాశాలల విభాగం:**
ఎస్జీటీలుగా జంగం రాజేశ్వరి (బాసర), రూపవత్ సునీత (మాంజ్రి-భైంసా), కె. వెంకటరమణ (మల్లాపూర్-దిలావర్‌పూర్), నెల్ల అనితారాణి (న్యూలోలం-దిలావర్‌పూర్), యు. గంగారాం (పేత రుపు-కడెం), ప్రవళిక (ధర్మాయిపేట్-కడెం), పి. సంతోష్ (బావాపూర్-కె-ఖానాపూర్), డి. రాజగంగ (బెల్గాం-కుబీర్), ఎస్. పద్మలత (కల్లూర్-కుంటాల), పోతుకంటి గంగాధర్ (లక్ష్మణచాంద), ఎస్. అర్చన (చింతల్ చాంద), తుంగెన నర్సింగరావు (పిప్రి-లోకేశ్వరం), వి. అలివేలు మంగా తాయారు (కమల్‌కోట్-మామడ), బి. ఉషాకిరణ్మయి (బాలికల పాఠశాల-ముధోల్), ఎండి. సైఫుద్దీన్ అర్షద్ (నైబాది-ముధోల్), పి. పావని (బూరుగపల్లె-జి-నర్సాపూర్), తోట లావణ్య (శాంతినగర్-నిర్మల్), మహ్మద్ ఖాలిద్ అహ్మద్ (సాయినగర్-నిర్మల్), రాపోల మాలతి (రత్నాపూర్ కాండ్లి-నిర్మల్ రూరల్), బి. వాణి (సాయినగర్-సారంగాపూర్), మహ్మద్ మోయిజుద్దీన్ (గోపాల్‌పేట్-సారంగాపూర్), గిరి జ్యోతి (బెల్తరోడ-తానూర్) పురస్కారాలకు ఎంపికయ్యారు కేజీబీవీలలో డి. సంధ్యారాణి (కుంటాల), సయ్యదా ఆలియా నాహిద్ (పెంబి), యు. సురేష్ (అర్బన్ స్కూల్-నిర్మల్), భవిత సెంటర్ రిసోర్స్ టీచర్ కె. భూమన్న (తానూర్) ఎంపికయ్యారు
ఉన్నత విద్యా విభాగంలో డాక్టర్ పవన్ కుమార్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల-భైంసా), కె. రమేష్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల-నిర్మల్), లెక్చరర్లు సందీప్ కులకర్ణి (భైంసా), డి. శ్రీనివాస్ (సారంగాపూర్), ఎం. మోహన్ (ఖానాపూర్) అవార్డులు అందుకోనున్నారు

**సైన్స్, ఇన్‌స్పైర్ ఉ గురుకులాల విభాగం:**
సిహెచ్. రమాదేవి (కుంటాల మోడల్ స్కూల్), సయ్యద్ ఫరాజ్ అబ్దుల్ కరీం (మస్కాపూర్), బాల్ దత్తాత్రేయ (అల్ఫోర్స్-భైంసా), కదర్ల సుప్రియ (వికాస్-భైంసా) ప్రత్యేక అవార్డులకు ఎంపి కయ్యారు.
**సంక్షేమ గురుకులాల నుంచి** ఎన్. అనూష, ఎల్. వసంత్ రావు, కె. జంగు, సత్యనారాయణ, హరిలత, సిహెచ్. అనూప్, కె. రాజు, కె. మాధురి, డి. గోపీకృష్ణ, అబ్దుల్ అహ్మద్, చిన్నరమణి అరుణ, ఫర్హానా తబస్సుమ్, ఉజ్మా తబస్సుమ్, జ్యోత్స్న ద్యాగల, నాగేశ్వరి, కె. సంధ్యారాణి పురస్కారాలు అందుకోనున్నారు. ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈవో కోరారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో అవకతవకలు: ఉపాధ్యాయ సంఘాలు

**నిబంధనలకు విరుద్ధంగా జూనియర్లకు కేటాయింపు..**
**కొన్ని మండలాలకే పెద్దపీట**
**అవార్డుల జాబితాను పునఃసమీక్షించాలని మీడియా సమావేశంలో డిమాండ్**



నిర్మల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకటించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని, నిబంధనలను తుంగలో తొక్కి ఏకపక్షంగా జాబితాను రూపొందించారని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కనీసం పదేళ్లకు పైగా నిరంతర సర్వీసు పూర్తి చేసుకుని విద్యా రంగంలో విశేష సేవలందించిన సీనియర్ ఉపాధ్యాయులను ఈ అవార్డులకు ఎంపిక చేయాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా కేవలం రెండు, మూడేళ్ల సర్వీస్ మాత్రమే ఉన్న జూనియర్లకు అవార్డులను ప్రకటించడం అత్యంత శోచనీయమని మండిపడ్డారు.
అలాగే జిల్లాలోని అన్ని మండలాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ సమతుల్యంగా ఎంపిక చేపట్టాల్సి ఉండగా, అధికారులపై ఉన్న ఒత్తిళ్లతో కొన్ని నిర్దిష్ట మండలాలకే పెద్దపీట వేసి మిగిలిన మండలాలను పూర్తిగా విస్మరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన సీనియర్ ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేసేలా ఉన్న ఈ అక్రమ అవార్డుల జాబితాను విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే రద్దు చేసి, నిబంధనల ప్రకారం పునఃసమీక్షించి అర్హులైన వారితో నూతన జాబితాను విడుదల చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.
ఈ మీడియా సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, జె. లక్ష్మణ్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్, గడ్డం భూమన్న, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోడిశెట్టి రవికాంత్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేంద్రాచారి, నాగచంద్రకాంత్‌లతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విద్యకు పెద్దపీట.. అభివృద్ధికి వేగం!

నిర్మాణ నాణ్యత విషయంలో రాజీపడవద్దని అధికారులను ఆదేశించారు.
అదే ప్రాంతంలో నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పనులను కూడా సీఎం పరిశీలించారు. పాఠశాల కోసం గతంలో భూములు ఇచ్చిన రైతులను గుర్తించి వారితో మాట్లాడారు. ఆయా కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానికులను పలకరించి వారి సమస్యలు, విజ్ఞాపనలను స్వీకరించారు.
వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం గోకఫసల్వాద్‌లో నిర్మిస్తున్న బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు.
హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌పై ప్రత్యేక దృష్టి
దుద్యాల మండలం హకీంపేట్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. వైద్య, వెటర్నరీ, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు 400 పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల, వసతి గృహాల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు.

# ఓటర్లకు మరో మూడు వారాలు!

కాకపోవడం, చిరునామాల్లో మార్పులు ఉండటం తదితర కారణాలతో కొంతమంది ఓటర్లకు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. తమ అర్హతను నిరూపించుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించడానికి ప్రస్తుత గడువు సరిపోవడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గడువు పెంచాలని సీఎం లేఖఅర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ఓటర్లు తమ వివరాలు, అర్హతకు సంబంధించిన పత్రాలను సమర్పించేందుకు మరింత సమయం ఇవ్వాలని, సవరణ ప్రక్రియ గడువును పొడిగించాలని కోరారు.ప్రస్తుతం ఉన్న షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంది. అనంతరం అక్టోబర్ 15 వరకు విచారణ ప్రక్రియ పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉంది. గడువు మూడు వారాలు పొడిగిస్తే తదుపరి ప్రక్రియకు కూడా అదనపు సమయం అవసరం కానుంది.తుది జాబితా మరింత ఆలస్యం?గడువు పొడిగింపుపై అధికారిక ఉత్తర్వులు వెలువడిన అనంతరం కొత్త షెడ్యూల్ ఖరారు కానుంది. దీంతో తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ కూడా ముందుగా నిర్ణయించిన అక్టోబర్ 19 నుంచి మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. నోటీసులు అందుకున్న ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే

# అసెంబ్లీ సమావేశాలకు ముందే కేసీఆర్‌పై కాంగ్రెస్ వ్యూహం!

గత పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనలో చేపట్టిన పలు ప్రాజెక్టులు, వాటి రూపకల్పన, నిధుల వినియోగం, ప్రభుత్వ నిర్ణయాలు తదితర అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.
అదేవిధంగా ప్రస్తుతం ప్రతిపక్షంగా భారత రాష్ట్ర సమితి అనుసరిస్తున్న వైఖరిని కూడా ఎండగట్టేందుకు ధర్నా వేదికగా కాంగ్రెస్ నాయకులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగానే రాష్ట్రం ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
ఇద్దరు కీలక మంత్రులకు బాధ్యతలు
ఈ ధర్నాను సాధారణ నిరసన కార్యక్రమంగా కాకుండా భారీ స్థాయిలో నిర్వహించేందుకు కాంగ్రెస్ నాయకత్వం ఏర్పాట్లు చేస్తోందని సమాచారం. ఇందుకోసం ఇద్దరు కీలక మంత్రులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.
వారి పర్యవేక్షణలోనే జనసమీకరణ, నాయకులకు బాధ్యతల కేటాయింపు, ధర్నా ఏర్పాట్లు తదితర అంశాలపై కార్యాచరణ కొనసాగుతున్నట్లు సమాచారం.
శనివారం సన్నాహక సమావేశం
ధర్నా నిర్వహణకు సంబంధించిన పూర్తి కార్యాచరణపై చర్చించేందుకు శనివారం కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి హైదరాబాద్ పరిధిలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, నియోజకవర్గాల బాధ్యులు, సమీప జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులు హాజరయ్యే అవకాశం ఉంది.
ధర్నాకు పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించడం, నాయకులకు అప్పగించాల్సిన బాధ్యతలు, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది.
ధర్నా చౌక్ నుంచే రాజకీయ సమరం
గతంలో ధర్నా చౌక్ వద్ద ఆందోళనలకు ఆంక్షలు విధించిన భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ తీరును కూడా కాంగ్రెస్ ఇప్పుడు ప్రస్తావించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అదే ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ భారీ నిరసన చేపట్టడం ద్వారా గత, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ప్రజల ముందుంచాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.
శాసనసభ సమావేశాలు ప్రారంభమైన తర్వాత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేందుకు ప్రయత్నించే అవకాశం ఉందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. అందుకే సభ ప్రారంభానికి ముందే ప్రతిపక్షంపై రాజకీయంగా ఒత్తిడి పెంచేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
కేసీఆర్ హాజరుపైనా ప్రశ్నలు?
ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వ్యవహరిస్తున్న తీరుతో పాటు శాసనసభ సమావేశాలకు ఆయన హాజరు, ప్రజా సమస్యలపై ఆయన వైఖరి వంటి అంశాలను కూడా ధర్నా వేదికగా కాంగ్రెస్ నాయకులు ప్రస్తావించే అవకాశం ఉందని సమాచారం.
మొత్తంగా శాసనసభ సమావేశాలకు ముందు కాంగ్రెస్ చేపట్టనున్న ఈ భారీ ధర్నా రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతోంది. అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే ముందే ప్రజాక్షేత్రంలో రాజకీయంగా పైచేయి సాధించాలన్న కాంగ్రెస్ వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం.. పార్టీ క్రమశిక్షణే ముఖ్యం

సమస్యలు ఉంటే వాటిని చర్చించేందుకు అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. పార్టీకి సంబంధించిన అంశాలను బహిరంగంగా చర్చించడం, నాయకత్వంపై బహిరంగ విమర్శలు చేయడం సరికాదని అన్నారు.
పార్టీకి సంబంధించిన విషయాలను అంతర్గతంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే పార్టీ ఎలాంటి స్థాయిలో ఉన్న నాయకుడిపైనైనా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.
సురేఖ తీరుపై అధిష్ఠానం ఆగ్రహం
కొండా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలు ఈ పరిణామాలకు కారణమయ్యాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.
బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కొండా సురేఖ తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను వెంటనే ఖండించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆ వ్యాఖ్యలపై ఆమె స్పందించకపోవడాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించిందని పేర్కొన్నారు.
పార్టీ క్రమశిక్షణ కమిటీ సేకరించిన వివరాలు, సమర్పించిన నివేదిక ఆధారంగానే అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.
రేవంత్‌పై ఆరోపణలను ఖండించిన పీసీసీ చీఫ్
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వస్తున్న ఆరోపణలను మహేష్ కుమార్ గౌడ్ ఖండించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ముఖ్యమంత్రికి లేదని అన్నారు.
కొండా సురేఖపై తీసుకున్న చర్య పూర్తిగా పార్టీ క్రమశిక్షణ, విధివిధానాలకు సంబంధించిన అంశమే తప్ప మరే ఇతర కారణం లేదని స్పష్టం చేశారు.
బీసీలకు కాంగ్రెస్ అండ
క్రమశిక్షణా చర్యలు తీసుకునే విషయంలో కులం, మతం, ప్రాంతం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోలేమని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.
కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ వెనుకబడిన వర్గాలకు ఎప్పటికీ ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. భవిష్యత్తులో వారికి మరింత ప్రాధాన్యత కల్పించాలనే ఆలోచన పార్టీ అధిష్ఠానానికి ఉందని పేర్కొన్నారు.
పార్టీలోనే కొనసాగాలని ఆకాంక్ష
మంత్రి పదవి కోల్పోయినంత మాత్రాన కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీకి దూరం కావాల్సిన అవసరం లేదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆమె పార్టీలోనే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు.
రాబోయే రోజుల్లో ఆచితూచి వ్యవహరిస్తే పార్టీలో ఆమెకు తగిన అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి: అంబేకర్ సాయిరాం



ముధోల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని ముధోల్ పీఏసీఎస్ చైర్మన్ అంబేకర్ సాయిరాం పిలుపునిచ్చారు. ముధోల్ మండల పరిధిలోని న్యూ ముద్గల్ గ్రామానికి చెందిన పిరాయివాడ విఠల్ మండల కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా గ్రామంలో పార్టీ శ్రేణులు, గ్రామస్తులతో కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండాలని సూచించారు. విఠల్ పార్టీ అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గాడేకర్ నరేష్, నాయకులు సాహెబ్‌రావు పటేల్, నరేష్ యాదవ్, అమృత్, అంకుష్, శివ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర శ్రీకృష్ణ మందిరంలో జన్మాష్టమి పూజలు.. నేడు పల్లకి సేవ



బాసర, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర గోదావరి తీరంలోని శ్రీకృష్ణ మందిరంలో జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు భూమన్న యాదవ్ ఆధ్వర్యంలో వేకువజామునే గోపాలకృష్ణ స్వామి వారికి పాలు, పెరుగు, వెన్న, తేనె వంటి పంచామృతాలతో ఏకాంత అభిషేకాలు నిర్వహించి విశేష నైవేద్యాలు సమర్పించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి గ్రామోత్సవ పల్లకి సేవ, చిన్నారులకు రాధాకృష్ణుల వేషధారణ పోటీలు, సాంప్రదాయ ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేసి భక్తులకు మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

## ఎడ్ బిడ్ ఫ్యూచర్ స్కూల్‌లో అలరించిన రాధాకృష్ణుల వేషధారణలు



ముధోల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని ఎడ్ బిడ్ గ్రామంలో ఉన్న ఫ్యూచర్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో రాధాకృష్ణుల చిత్రపటానికి ప్రిన్సిపాల్ ప్రవీణ్ ప్రత్యేక పూజలు నిర్వహించి సాంప్రదాయ ఉట్టి కొట్టే వేడుకను ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో చేసిన నృత్య ప్రదర్శనలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అలరించాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు బోధించిన భగవద్గీత సందేశం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు మార్గదర్శకమని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచేందుకు పండుగలను నిర్వహించడం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖాకీ పక్షపాతం! -- తక్షణ న్యాయం పెద్దలకేనా... సామాన్యులకు దక్కదా?

## చట్టం పరిధి దాటిన రాజకీయం..ఆదివాసీ యువతి శిరీష కేసులో మిగిలిన ప్రశ్నలివే!




రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, చట్టం ముందు అందరూ సమానులేనన్న పరమోన్నత ప్రజాస్వామ్య సూత్రాలు నేడు కేవలం చట్టపు పుస్తకాలకే పరిమితమవుతున్నాయా అనే తీవ్రమైన అనుమానాలు పౌర సమాజంలో బలంగా వ్యక్తమవుతున్నాయి. సమాజంలో ధనబలం, అధికార ప్రయోజనాలు, రాజకీయ రక్షణ ఉన్నవారికి లభించే తక్షణ స్పందన, విచారణలోని వేగం... ఏ ఆసరా లేని పేదలకు, దళితులకు, ఆదివాసీలకు ఎందుకు దూరమవుతోందో వ్యవస్థలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. నేరం జరిగినప్పుడు బాధితుడి సామాజిక నేపథ్యం, ఆర్థిక స్థోమతను బట్టి పోలీసు యంత్రాంగం యొక్క స్పందన, విచారణ తీవ్రత మారిపోతోందనే చేదు నిజం మరోసారి బహిర్గతమైంది.

**వీఐపీలకో న్యాయం... గిరిజనులకో న్యాయమా?**

నర్సుగా సమాజానికి సేవ చేస్తూ సొంత కాళ్లపై నిలబడటానికి ప్రయత్నిస్తున్న ఆదివాసీ యువతి శిరీషపై జరిగిన ఘోరమైన అత్యాచారం, హత్య ఉదంతం మన వ్యవస్థల్లో ఉనికిలో ఉన్న తీవ్రమైన పక్షపాత వైఖరిని నడిరోడ్డుపై నిలబెట్టింది. ఒక సామాన్య గిరిజన బిడ్డకు ఇంతటి దారుణం జరిగి ప్రాణాలు కోల్పోతే, రోజుల తరబడి నిందితులను పట్టుకోవడంలో అధికార యంత్రాంగం చూపుతున్న ఉదాసీనత వెనుక ఉన్న అసలు కారణమేమిటి అనే ప్రాథమిక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే నేరం ఏ అగ్రకులానికి చెందిన ధనవంతుల పిల్లలకో, రాజకీయ నాయకులకో, లేక ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతాధికారుల కుమార్తెలకు ఎదురైతే పోలీసు వ్యవస్థ ఇలాగే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండేదా? ఏ రాజకీయ నాయకుడి బిడ్డకైనా ఈ రకమైన పరిస్థితి ఎదురైతే యంత్రాంగం ఇంతటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించే సాహసం చేయగలదా? పోలీసు వర్గాలు నిమిషాల్లో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి, గంటల వ్యవధిలోనే నేరస్థులను పట్టుకుని మీడియా ముందుకు హాజరుపరచేవి కావా? మరి ఆదివాసీ నర్సు విషయంలో ఈ వేగం, ఈ తీవ్రత ఎందుకు మాయమయ్యాయి?

**కాకి దుస్తుల ప్రాధాన్యతలు -- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన వ్యవస్థలు**

ప్రజాస్వామ్యంలో పోలీసు వ్యవస్థ సామాన్య ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉందా లేక ప్రభుత్వాల ఆదేశాలను, అధికార పక్షాల రాజకీయ ప్రయోజనాలను కాపాడే సాధనంగా మారిందా అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. చట్టం ప్రకారం నేరం జరిగిన వెంటనే నిష్పాక్షికంగా విచారణ ముమ్మరం చేసి, సాక్ష్యాధారాలను సేకరించి నిందితులను అరెస్టు చేయడం అధికారుల ప్రాథమిక బాధ్యత. కానీ, కొన్ని ప్రత్యేక ఘటనలు జరిగినప్పుడు "తక్షణ న్యాయం" పేరుతో ఎన్‌కౌంటర్ల దాకా వెళ్లి హెడ్‌లైన్లలో నిలిచే చర్యలకు దిగే పోలీసు యంత్రాంగం, గిరిజన బాధితుల విషయంలోకి వచ్చేసరికి ఎందుకు మౌనం వహిస్తోంది? కేసు నమోదు చేయడంలో కూడా నాన్చుడి ధోరణి ప్రదర్శించడం వెనుక ఏ రాజకీయ శక్తి ఒత్తిడి ఉందో స్పష్టం చేయాలి. అధికారంలో ఉన్నవారి ప్రాధాన్యతలకు, ప్రభుత్వం ఇచ్చే అంతర్గత సంకేతాలకు అనుగుణంగానే ఖాకీ దుస్తుల ప్రాధాన్యతలు మారిపోతున్నాయా? ప్రభుత్వాల వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, తమ కుర్చీలను కాపాడుకోవడానికి అధికారులు రాజ్యాంగ నిబంధనలను, వృత్తిధర్మాన్ని పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారనడానికి ఈ నిర్లక్ష్యమే ప్రత్యక్ష నిదర్శనం.

**ప్రజాప్రతినిధుల నేరపూరిత మౌనం -- ఓట్ల వ్యాపారమే పరమావధిగా...**

మరొకవైపు ప్రజల ఓట్లతో గెలిచి చట్టసభల్లో అడుగుపెట్టిన ప్రజాప్రతినిధుల మౌనం సమాజానికి మరింత ప్రమాదకరంగా మారింది. ఒక సామాన్య ఆదివాసీ యువతికి ఘోర అన్యాయం జరిగి ఆమె కుటుంబం కన్నీరుమున్నీరవుతుంటే, గిరిజనేతర ప్రజాప్రతినిధులు కనీసం పరామర్శించడానికి కూడా ముందుకు రాకపోవడం వారి రాజకీయ స్వార్థాన్ని, సమాజంలోని అంతర్లీన వివక్షపూరిత మనస్తత్వాన్ని బట్టబయలు చేస్తోంది. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నిమిషానికో హామీ ఇస్తూ గిరిజన గూడేలకు వచ్చే నాయకులు, ఒక పేద బిడ్డ ప్రాణాలు పోయినప్పుడు ముఖం చాటేయడం ఏ రకమైన ప్రజాప్రాతినిధ్యం? ఒక వర్గానికి న్యాయం జరిగినప్పుడు వేదికలపై సంబరాలు చేసుకోవడం, గిరిజనులకు అన్యాయం జరిగినప్పుడు కనీసం నోరు విప్పకపోవడం ప్రజాస్వామ్యానికే పెద్ద మచ్చగా మారుతోంది. న్యాయం అనేది కులాన్ని, వర్గాన్ని బట్టి మారితే అది ప్రజాస్వామ్యం అనిపించుకోదు.

**జవాబుదారీతనం లేని పాలన -- బాధ్యులపై క్రిమినల్ చర్యలే పరిష్కారం**

సామాన్యుల ప్రాణాలకు, వారి కుటుంబాల మనోభావాలకు విలువ లేని చోట చట్టబద్ధ పాలన ఉందనడం ఆత్మవంచన మాత్రమే అవుతుంది. బాధితులు ఏ కులానికి, ఏ వర్గానికి చెందినవారైనా సరే, కేసు నమోదు చేయడం నుండి విచారణ మరియు శిక్ష అమలు వరకు చట్టం పక్షపాతం లేకుండా పని చేయాలి. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టాలను, మహిళా రక్షణ చట్టాలను ఎవరి ముఖప్రీతి కోసమో లేదా తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసమో కాకుండా బాధితులకు ఊరటనిచ్చేలా కఠినంగా అమలు చేయాలి. కేసు నమోదులో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసే, నిందితులను కాపాడేందుకు ప్రయత్నించే లేదా రాజకీయ వత్తిళ్లకు లొంగే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినప్పుడే వ్యవస్థపై ప్రజలకు అరకొరగా ఉన్న నమ్మకం నిలబడుతుంది.

**సమానత్వంతో కూడిన భరోసానే వ్యవస్థల పురోగతికి మార్గం**

సమాజంలో ఆడబిడ్డలు ధైర్యంగా బయటకు వచ్చి చదువుకుని, ఉద్యోగాలు చేసుకునే వాతావరణం ఏర్పడాలంటే భయంతో కూడిన పరిస్థితులు పూర్తిగా మారాలి. బాధితుడి వెనుక ఎవరున్నా, వారి సామాజిక హోదా ఏమైనా చట్టం తక్షణమే స్పందిస్తుందనే భరోసా కల్పించడం ప్రభుత్వం మరియు పోలీసు వ్యవస్థ యొక్క ప్రాథమిక బాధ్యత. ప్రజాప్రతినిధులు, పోలీసు యంత్రాంగం ఇప్పటికైనా తమ వివక్షపూరిత వైఖరిని వీడి, సామాన్య గిరిజన బిడ్డ శిరీష కుటుంబానికి తక్షణ న్యాయం అందించాలి. నిందితులను కఠినంగా శిక్షించకపోతే ప్రజల ఆగ్రహ జ్వాలల్లో ఈ వ్యవస్థల విశ్వసనీయత పూర్తిగా దగ్ధమైపోక తప్పదు.



వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## ముధోల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సంబరాలు



ముధోల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ పట్టణ కేంద్రంలోని మహాలక్ష్మి గల్లీలో ఉన్న శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంఘం భవనంలో శ్రీకృష్ణుడి ప్రతిమను పూలతో సుందరంగా అలంకరించి మామిడి తోరణాలు కట్టి పండుగ వాతావరణం కల్పించారు. యాదవ సంఘం పెద్దలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణలతో ప్రత్యేక పూజలు జరిపి ఉట్టి కొట్టే సంబరాన్ని చేపట్టారు. శ్రీకృష్ణ భగవానుడి జీవనం యావత్ ప్రపంచానికి ఆదర్శమని, ఆయన చూపిన ధర్మ మార్గంలో నడవాలని సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## రేవంత్--అసద్ దోస్తీపై కొత్త చర్చ!

పేర్కొన్నారు. అంతేకాకుండా తాను కాంగ్రెస్‌కు కాకుండా రేవంత్‌రెడ్డికే మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. పాతబస్తీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, మూసీ ప్రాజెక్టు వంటి కీలక అంశాల నేపథ్యంలో ప్రభుత్వం--ఎంఐఎం మధ్య సమన్వయం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎంఐఎం సన్నిహితంగా ఉండగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంతో సానుకూలంగా వ్యవహరిస్తుండటం ఆసక్తిని పెంచుతోంది. అయితే ఈ సాన్నిహిత్యం భవిష్యత్‌లో రాజకీయ అవగాహనగా మారుతుందా? లేక హైదరాబాద్ అభివృద్ధి అంశాలకే పరిమితమవుతుందా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రాబోయే ఎన్నికల నేపథ్యంలో రేవంత్--అసద్ సంబంధాలు ఎలాంటి రాజకీయ మలుపు తీసుకుంటాయన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొడతారా?

చెత్త రుసుమును వసూలు చేసే ప్రతిపాదన వల్ల ప్రజల నుంచి నేరుగా రుసుము పొందుతున్న కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వయం ఉపాధితో జీవిస్తున్న వారికి నెలకు రూ.16 వేల వేతనం మాత్రమే ఇచ్చే ప్రతిపాదన ఉంటే, దానితో కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు.రాంకీ సంస్థ కోసం స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని కవిత డిమాండ్ చేశారు. కార్మికులకు అన్యాయం జరిగితే తెలంగాణ రక్షణ సేన అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే ముఖ్యమంత్రి నివాసం ముందు వెయ్యి ఆటోలతో చెత్త పోస్తామని హెచ్చరించారు.
స్వచ్ఛ ఆటో కార్మికులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి ప్రభుత్వం రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డుల వద్ద కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని,

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# దేవుడిని చూడాలంటే ఎక్కడికి వెళ్లాలి?

## దైవం దూరంలో లేదు.. మనం చూసే చూపులోనే ఉంది

దేవుడిని చూడాలంటే ఎక్కడికి వెళ్లాలి? అనే ప్రశ్నకు ఒక్కొక్కరు ఒక్కో సమాధానం చెబుతారు. ఎవరికైనా ఆలయంలో కనిపిస్తాడు.. మరొకరికి పూజలో కనిపిస్తాడు.. ఇంకొకరికి భజనలో కనిపిస్తాడు. కానీ నిజమైన భక్తికి మరొక అందమైన కోణం ఉంది. దైవాన్ని వెతకడానికి మనం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు.. మనం చూసే విధానం మారితే మన చుట్టూ ఉన్న జీవితంలోనే దైవత్వాన్ని చూడగలుగుతాం.

ఉదయం నిద్రలేచి తల్లిదండ్రుల ముఖాన్ని చూడటం, మన కోసం కష్టపడే కుటుంబ సభ్యులను చూడటం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, మనకు తెలియని వ్యక్తి కష్టంలో ఉంటే చేతనైనంత సహాయం చేయడం.. ఇవన్నీ సాధారణమైన సంఘటనల్లా కనిపించవచ్చు. కానీ ప్రతి జీవిలోనూ దైవాన్ని చూడగలిగే మనసు ఉన్నప్పుడు ఇవే ఆధ్యాత్మిక అనుభూతులుగా మారుతాయి.

మన సంప్రదాయం మనిషిని కేవలం దేవుడిని ఆరాధించమని చెప్పలేదు. జీవులన్నింటినీ గౌరవించాలనే భావనను కూడా నేర్పింది. అందుకే ఇంటి గడపకు వచ్చే అతిథి నుంచి.. ఆకలితో ఉన్న జీవి వరకు ప్రతి ఒక్కరినీ ఆదరించే సంస్కారం మనలో పెరిగింది. ఒక చిన్న సహాయం చేయడానికి పెద్ద సంపద అవసరం లేదు. ఒక మంచి మాట చెప్పడానికి డబ్బు అవసరం లేదు. ఎదుటివారి బాధను అర్థం చేసుకోవడానికి ప్రత్యేకమైన శక్తి అవసరం లేదు. కావాల్సింది మంచి మనసు మాత్రమే.

కొన్నిసార్లు మనం దేవుడి దగ్గర పెద్ద పెద్ద కోరికలు కోరుతాం. కానీ మన పక్కనే ఉన్న వ్యక్తి చిన్న కోరికను కూడా పట్టించుకోము. వృద్ధ తల్లిదండ్రులకు కొంత సమయం కావాలి. పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ కావాలి. కష్టాల్లో ఉన్న బంధువుకు ఒక ధైర్యం చెప్పే మాట కావాలి. ఒంటరిగా ఉన్న వ్యక్తికి ఒక పలకరింపు కావాలి. ఇవన్నీ మనకు చిన్నవిగా అనిపించవచ్చు.. కానీ వారి జీవితంలో అవి ఎంతో పెద్దవిగా ఉండవచ్చు.

ఆధ్యాత్మికత అంటే ప్రపంచాన్ని వదిలి దూరంగా వెళ్లడం మాత్రమే కాదు. ప్రపంచంలోనే ఉంటూ మన దృష్టిని మార్చుకోవడం కూడా. మనం చేసే పనిలో నిజాయితీ ఉండాలి. మాట్లాడే మాటలో మాధుర్యం ఉండాలి. మన వల్ల మరొకరికి అనవసరమైన బాధ కలగకుండా జాగ్రత్త పడాలి. మనకు చేతనైనంత మంచిని చేయాలి. ఇవన్నీ కలిసినప్పుడే భక్తి జీవితంలో కనిపిస్తుంది.

దేవుడి ముందు వెలిగించే దీపం మనకు వెలుగును గుర్తు చేస్తుంది. అదే విధంగా మన వల్ల మరొకరి జీవితంలో వెలుగు వస్తే.. ఆ దీపారాధనకు మరింత అర్థం వస్తుంది. ఆలయంలో సమర్పించే పుష్పం పవిత్రమైనదే. కానీ ఒక బాధలో ఉన్న మనిషికి అందించే ఓదార్పు కూడా అంతే పవిత్రమైనది. దేవుడికి సమర్పించే నైవేద్యం గొప్పదే. కానీ ఆకలితో ఉన్నవారికి పెట్టే అన్నం కూడా దైవారాధనతో సమానమైన ఆనందాన్ని ఇవ్వగలదు.

అందుకే దేవుడిని వెతకడం ఆపేయమని కాదు.. మరింత భక్తితో వెతకాలి. కానీ ఆ వెతుకులాటలో మన చుట్టూ ఉన్న మనుషులను మరిచిపోకూడదు. ఆలయంలో కనిపించే దైవాన్ని మనసులో నిలుపుకుని.. బయట కనిపించే మనిషిలో కూడా అదే దైవత్వాన్ని గౌరవించగలిగితే మన భక్తి మరింత సంపూర్ణమవుతుంది.

దైవం ఎక్కడున్నాడో తెలుసుకోవడానికి కొన్నిసార్లు కళ్లను మూసుకోవాలి.. కానీ ఆయన కరుణను గుర్తించడానికి కళ్లను తెరిచి మన చుట్టూ చూడాలి. మనం చేసే ప్రతి మంచి పని, మనం పలికే ప్రతి ఆప్యాయమైన మాట, మనం పంచే ప్రతి సహాయం.. మన జీవితంలో దైవాన్ని ఆహ్వానించే ఒక చిన్న అడుగే.



--- సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మండల అధ్యక్షుడు కిష్టయ్య

### ముధోల్‌లో ఘనంగా కాంగ్రెస్ మండల నూతన కార్యవర్గ సమావేశం.. సభ్యులకు సన్మానం



ముధోల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే పరమావధిగా అద్భుతమైన పాలన సాగిస్తోందని ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిష్టయ్య అన్నారు. మండల కేంద్రమైన ముధోల్‌లో శుక్రవారం నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కిష్టయ్య మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్, సర్పంచులు రుచిత దిగంబర్, జైశ్రీ కాంత్‌రావు, జిల్లా కార్యదర్శి బషీర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు విశ్వంభర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు రాంరెడ్డి, సాయినాథ్, గౌతమ్, రాజేందర్ రెడ్డి, నాయకులు మాక్దూమ్, శ్రీనివాస్ గౌడ్, విఠల్ కాంబ్లే, సంజు, అబిద్, అఫ్రోజ్, ధర్మేందర్ పాల్గొన్నారు.

# పేదరికాన్ని జయించి

# 'నీట్'లో సత్తాచాటిన దళిత బిడ్డ

- ఆదిలాబాద్ 'రిమ్స్'లో ఎంబీబీఎస్ సీటు సాధించిన భలేరావ్ అభినవ్
- మేస్త్రీ, వ్యవసాయ కూలీల కుమారుడికి సర్వత్రా ప్రశంసలు.. పేదలకు ఉచిత వైద్యమే లక్ష్యం

.భైంసా/ముధోల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం.. పూట గడవడమే గగనమయ్యే ఆర్థిక పరిస్థితులు ఆ యువకుడి సంకల్ప బలాన్ని అడ్డుకోలేకపోయాయి. కటిక దారిద్ర్యాన్ని ఎదురొడ్డి జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్ష (నీట్)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు కైవసం చేసుకున్నాడు భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన దళిత విద్యార్థి భలేరావ్ అభినవ్. ఇలేగాం గ్రామానికి చెందిన భలేరావ్ ఆనందరావు భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తుండగా, తల్లి కాంతబాయి వ్యవసాయ కూలీగా నిత్యం శ్రమిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన అభినవ్ ఎలాగైనా డాక్టర్ కావాలనే బలమైన ఆశయంతో ఎలాంటి ఖరీదైన కార్పొరేట్ కోచింగ్‌లు తీసుకోకుండానే సొంతంగా ప్రణాళికాబద్ధంగా చదివాడు.





ఇటీవల విడుదలైన ఫలితాల్లో అభినవ్ 450 మార్కులు సాధించి, ప్రతిష్టాత్మకమైన ఆదిలాబాద్ ప్రభుత్వ రిమ్స్ (=×మీా) వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా అభినవ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల నిరంతర శ్రమ, త్యాగాలే తన విజయానికి కారణమని భావోద్వేగానికి లోనయ్యాడు. భవిష్యత్తులో ఉత్తమ వైద్యుడిగా ఎదిగి తన గ్రామం లాంటి మారుమూల ప్రాంతాల్లోని నిరుపేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తానని స్పష్టం చేశాడు. అణగారిన వర్గం నుంచి వచ్చి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన అభినవ్‌ను ఇలేగాం గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ముధోల్ శిశుమందిర్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి శోభాయాత్ర

ముధోల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముధోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం వేకువజామునే పట్టణంలో కన్నులపండువగా శోభాయాత్ర నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ ఘోష్ వాయిద్యాలతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. పట్టణంలోని పది ప్రముఖ కూడళ్ల వద్ద శ్రీకృష్ణుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కృష్ణుడి వేషధారణలోని విద్యార్థులతో ఉట్టి కొట్టించారు. చిన్నారులు ధరించిన రాధాకృష్ణులు, గోపికల వేషధారణలు, భక్తిగీతాల నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానికులు విద్యార్థులకు పండ్లు, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆచార్యులు మాట్లాడుతూ విద్యార్థులు శ్రీకృష్ణుడి ధర్మ సందేశాలను, జీవన విలువలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ బాధ్యులు, ఆచార్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ముధోల్‌లో ముధోల్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని శంకర్ రేషన్ దుకాణంలో శుక్రవారం అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామ సర్పంచ్ షబానా బేగం ఎజాజోద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు, సరుకుల పంపిణీ వేగవంతం చేసేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిందన్నారు. రేషన్ పంపిణీతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ఈ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అర్హులైన పేద కుటుంబాలన్నీ ప్రభుత్వం అందించే రేషన్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్మార్ట్ కార్డులు అందుకున్న మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ శంకర్, భోజరాం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## సారంగాపూర్ మండల కురుమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సారంగాపూర్, సెప్టెంబర్ 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండల కేంద్రంలోని బీరప్ప దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం మండల కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల కుల పెద్దలు, జిల్లా నాయకుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడిగా ఎకలేరు గంగాధర్, గౌరవ అధ్యక్షులుగా సారంగాపూర్ సర్పంచ్ కునేరు భూమన్న, కాలువ నరేష్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఒలికిరి నరేష్, ప్రధాన కార్యదర్శిగా కామేటి భోజన్న, కోశాధికారిగా సాయిల నరసయ్య, సలహాదారుగా జెడ్ల మహేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా సూర్య సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని కురుమ కులస్తులందరినీ ఏకతాటిపైకి తెచ్చి సంఘం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు రాములు, చిన్నయ్య, దేవన్న, సట్వాజీ తదితరులు పాల్గొన్నారు.



## నింగిలోకి 'నాటీ బాయ్'.. విజయ విహారం!

నిమిషాల ప్రయాణం అనంతరం 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 భూపరిశీలన ఉపగ్రహాన్ని నిర్దేశిత ఉప-భూస్థిర బదిలీ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇస్రోకు అత్యంత కీలకమైన ఈ ప్రయోగం ద్వారా భూమిని నిరంతరం పరిశీలించే సామర్థ్యం మరింత బలోపేతం కానుంది. భూవీక్షణకు ఉపయోగపడే ఈఓఎస్-05 ద్వారా వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, పర్యావరణ పరిశీలనతో పాటు ఇతర కీలక రంగాలకు అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు వీలు కలగనుంది. ఇది భూస్థిర తరహా కక్ష్య నుంచి భూమిని పరిశీలించేందుకు రూపొందించిన భారత తొలి ఉపగ్రహంగా ప్రత్యేకతను సంతరించుకుంది.

జీఎస్ఎల్‌వీ రాకెట్ గతంలో ఎదుర్కొన్న కొన్ని వైఫల్యాల కారణంగా ఇస్రో వర్గాల్లో 'నాటీ బాయ్'గా పేరొందింది. ఈసారి మాత్రం ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసి తన సామర్థ్యాన్ని చాటుకుంది. ఇది జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 19వ ప్రయోగం కావడం విశేషం.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER